క్లుప్తంగా

మసీదు అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో దూదేకుల సంఘం నాయకులు, మసీదు కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : దూదేకుల సంఘం మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో దూదేకుల సంఘం నాయకులు, మసీదు కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులో ఉన్న దూదేకుల సంఘం మసీదు, కబరస్థాన్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. మసీదు కమిటీ అధ్యక్షుడు చెరుకూరి నాగూర్, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు పగిడాల ఓబులేసు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడాల దస్తగిరి పాల్గొన్నారు.

అభివృద్ధిపై కట్టుబడి ఉన్నాం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అభివృద్ధి చేసి ఉంటేనే ఓటు వేయాలని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేసిన విమర్శలపై మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరులో మార్కెట్ నిర్మాణానికి ఎవరు నిధులు మంజూరు చేయించారు, రామేశ్వరం పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం ఎలా జరుగుతోంది, బస్టాండ్‌కు ఎవరు నిధులు మంజూరు చేయించారు అన్న విషయాలు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ చరిత్రలో ఇంత వరకు ఎవరూ తాగునీటి సమస్యను పరిష్కరించకపోగా ఎమ్మెల్యే రాచమల్లు హయాంలోనే పరిష్కారం కావడం గొప్ప విషయమన్నారు.

నేలను కాపాడుకోవాలి

మైదుకూరు : కాలుష్యానికి గురికాకుండా నేలను కాపాడుకోవాల్సిన అవసరం రైతులపై ఉందని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మంగళవారం కేవీకేలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించడం వల్లే నేలలో సారవంతం తగ్గిపోతుందని అన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పిరోజ్ హుస్సేన్, కాంతిశ్రీ, తిప్పిరెడ్డిపల్లె సర్పంచ్ బండి నాగేంద్ర, ఎఫ్‌పీఓ చైర్మన్ టి.నరసింహారెడ్డి, రైతు నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల : 'ఆడుదాం ఆంధ్రా' ఆటలపోటీలకు సంబంధించి క్రీడా సామగ్రి పోరుమామిళ్ల మండలానికి చేరుకుంది. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న ఆటల పోటీలకు క్రీడా సామగ్రిలో కొన్ని సచివాలయాలకు మంగళవారం పార్టీ నాయకులు కిట్స్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ కె.రమణారెడ్డి, ఎంపీటీసీ ఇస్హాక్, ఎంపీడీఓ వరప్రసాదరావు ఈ క్రీడా సామగ్రిని సచివాలయాలకు అందజేశారు.

క్రీడా పోటీల్లో పాల్గొనాలి

చాపాడు : గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రభుత్వం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీపీ, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు గ్రామ సచివాలయ కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు.

ప్రతి బిడ్డ ఆసుపత్రిలోనే జన్మించాలి

బి.కోడూరు : ప్రతి బిడ్డ ఆసుపత్రిలోనే జన్మించాలని బి.కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. మంగళవారం ఆశ డే సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాన్పు ఆసుపత్రిలో అయ్యే విధంగా ప్రోత్సహించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఐరన్ సిరప్ తప్పక వేయించాలన్నారు.

అన్నదానం



ప్రొద్దుటూరు కల్చరల్ : కొర్రపాడు రోడ్డులోని తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో మంగళవారం కాలభైరవ స్వామి జయంతిని నిర్వహించారు. కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులస్వామి పూజాకార్యక్రమాలను చేసి పూలతో, వడమాలతో స్వామిని అలంకరించారు. మధ్యాహ్నం 1500 మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

వ్యాక్సిన్ వేయించుకోవాలి

రాజుపాళెం : గొర్రెలు, మేకల్లో పారుడు రోగం రాకుండా ముందస్తుగానే వ్యాక్సిన్ వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతులకు పశు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.

రైతులను నష్టాల్లో ముంచిన మిచాంగ్



కాశినాయన: దెబ్బతిన్న అరటి చెట్లు



వరి పంట పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

గోపవరం : మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. మంగళవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, ఏఓ అరవిందనాయక్, వ్యవసాయ సిబ్బంది విస్తృతంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ బద్వేలు డివిజన్ పరిధిలో 1200 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు.

దెబ్బతిన్న వరి, మొక్కజొన్న

పోరుమామిళ్ల : సంచర్ల, అక్కలరెడ్డిపల్లె, టేకూరుపేట, సిద్దవరం, చల్లగిరిగెల, వెంకటరామాపురం తదితర పంచాయతీల్లో వరి పంట బాగా దెబ్బతింది. రబీలో సాగు చేసిన మొక్కజొన్న కవలకుంట్ల, తిమ్మారెడ్డిపల్లె, టేకూరుపేట, యరసాల, రాజాసాహెబ్‌పేట, సిద్దవరం పంచాయతీల్లో నేలకు వాలింది. పంట నష్టం గురించి వ్యవసాయాధికారి వరహరికుమార్‌ను విచారించగా వరి పంట 149 ఎకరాల్లో, క్రాసింగ్ మొక్కజొన్న 30 ఎకరాలల్లో దెబ్బతిందని తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

బద్వేలు అర్బన్ : తిరువెంగళాపురం, అనంతరాజుపురం, కొంగలవీడు, పుట్టాయపల్లె, తిప్పనపల్లె పంచాయతీల్లో అధిక శాతం వరి పంట నీట మునిగింది. అలాగే మొలక దశలో ఉన్న మొక్కజొన్న పంట సైతం వర్షాలకు నేలవాలి మోకాలిలోతు నీళ్లలో మునిగిపోయింది. మండల పరిధిలో సుమారు 625 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో జొన్న, 25 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాల్లో పెసర పంటలు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు అంచనాలు సిద్ధం చేశారు.

నేలకొరిగిన అరటి, వరి

కాశినాయన : మండలంలో 150 ఎకరాల్లో అరటిపంట దెబ్బతింది. 50 ఎకరాల్లో వరి పంట నేలకొరిగి ధాన్యం రాలిపోయాయని రైతులు వాపోతున్నారు.

నష్టాలను మిగిల్చిన మిచాంగ్

అట్లూరు : మండల పరిధిలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఈదురు గాలులతో కురిసిన వర్షంతో పంట చేతికి అందే దశలో ఉన్న వరిపంట నేలకొరిగింది. దోసపంట దెబ్బతింది.

671 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

మైదుకూరు : మైదుకూరు మండలంలో రైతులు సాగు చేసిన 671 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరి, మినుము, జొన్న, మొక్క జొన్న తదితర పంటలు గాలులు వేగానికి నేలవాలాయి. మంగళవారం సాయంత్రం ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి మైఖేల్ రాజీవ్, మండల స్థాయి అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని ఓబులాపురం గ్రామం వద్ద నేల వాలిన వరి పంటను పరిశీలించారు. కొత్తపల్లె గ్రామానికి చెందిన అందే సుధాకర్ రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంటను కూడా అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ మైదుకూరు మండలంలో 459 హెక్టార్లలో వరి, 124 హెక్టార్లలో మినుము, 53 హెక్టార్లలో జొన్న, 35 హెక్టార్లలో మొక్క జొన్న పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

చాపాడు : మిచాంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. మండలంలో దెబ్బతిన్న వరి పంటలను మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించారు.

దెబ్బతిన్న ప్రతి పంట గుర్తింపు

నష్టపోయిన ప్రతి పంటకు ప్రభుత్వ పరిహారం అందుతుందని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య అన్నారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను మంగళవారం ఏడీఏ కృష్ణమూర్తి, వ్యవసాయాధికారి మ్యాగీతో కలసి ఎంపీపీ లక్షుమయ్య పరిశీలించారు. చాపాడు మండల వ్యాప్తంగా 1400 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, మరో రెండు రోజుల పాటు దెబ్బతిన్న పంటలను గుర్తిస్తామని ఏఓ తెలిపారు.

నష్టాన్ని మిగిల్చిన తుపాను

బి.కోడూరు : గుంతపల్లె, మేకవారిపల్లె, పెదుళ్లపల్లె, రాజుపాలెం, మున్నెల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన వరి పంట దెబ్బతింది. మేకవారిపల్లె, ఐత్రంపేట, రామసముద్రం, ఎం.నరసింహ్మాపురం, అనుమోరుపల్లె, అక్కుపాలెం, మున్నెల్లి, రాజుపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది.

కలసపాడులో..

కలసపాడు : మొక్కజొన్న, వరి, మినుము, అరటి, పొగాకు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని ఎగువరామాపురం, ఎగువ తంబళ్లపల్లె, రెడ్డిపల్లె, గంగాయపల్లె, మహానందిపల్లె, బ్రాహ్మణపల్లె, బ్రాహ్మణపల్లె, సిద్ధమూర్తిపల్లె గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఎక్కువగా వరిపంట దిబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ తెలిపారు.

బద్వేలులో ఎడతెరిపిలేని వర్షం

బద్వేలు అర్బన్ : తుపాను కారణంగా పట్టణంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన ఎడతెరపిలేని వర్షానికి వివిధ వార్డుల్లోని డ్రైనేజీలు ఉప్పొంగడంతోపాటు ప్రధాన రహదారులపై మురుగునీరు నిలిచింది. సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, పోరుమామిళ్ల రోడ్లల్లో వర్షపునీరు నిలిచింది. కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు.

మండల మీట్‌లో మాటల యుద్ధం

- వైస్ ఎంపీపీ నిర్లక్ష్యంతోనే పనులు ఆసల్యం
- అధికారులపై నిందలు మోపడం సరికాదు
- చంద్రభాస్కర్ రెడ్డి ఉపాధ్యక్ష పదవికి రాజీనామా



ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డితో మాట్లాడుతున్న చంద్రభాస్కర్‌రెడ్డి

ఖాజీపేట : మండల మీట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య మాటల యుద్ధం సాగింది. మంగళవారం ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ అబూబకర్‌సిద్ధిక్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఖాజీపేట -3 ఎంపీటీసీ (వైస్ ఎంపీపీ) అధికారులపై నిందలు వేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దీనిపై ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి స్పందిస్తూ తీవ్రంగా మండిపడ్డారు. రూ. 1.04 కోట్లతో బాలుర ఉన్నత పాఠశాలలో తరగతులు భవన నిర్మాణం మొదలు పెట్టామన్నారు. పార్టీకి చెందిన వ్యక్తి అని పనులు అప్పగిస్తే చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఫలితంగా నిర్మాణంలో ఆలస్యం జరిగిందన్నారు. మేస్త్రీకి డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడం వల్ల పనులు చేయలేదన్నారు. నేను భరోసా ఇచ్చి పనులు మొదలు పెట్టించి పనులు జరిగేలా చేస్తున్నానన్నారు. అనవసరంగా అధికారులపై బీరాలు పలికితే బాగుండదని హెచ్చరించారు. అనంతరం వైస్ ఎంపీపీ పదవికి చంద్రభాస్కర్‌రెడ్డి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజీనామా పత్రాన్ని ఎంపీపీకి అందజేసి వెళ్లిపోయారు. ఆయన రాజీనామాను అధికారులు ఆమోదించారు.

పంట నష్ట అంచనాలు పంపించండి

అకాల వర్షల వల్ల వరి పంట పూర్తిగా దెబ్బతినిందని సభ్యులు ఏఓ నాగార్జున దృష్టికి తీసుకు వచ్చారు. 150 హెక్టార్లలో పంట నేలకొరిగినట్లు అంచనా వచ్చిందని, ఇంకా పూర్తి స్థాయిలో సమాచారం తెప్పించుకుని అధికారులకు నివేదిక పంపుతామని ఏఓ తెలిపారు.

కార్యదర్శులు ఎందుకు హాజరు కావడం లేదు

మండల సమావేశం జరిగే సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది, పంచాయతీ సెక్రటీలు హాజరు కాకపోవడంపై ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ మండిపడ్డారు. అనంతరం ఖాజీపేటలోకి రాత్రి వేళల్లో బస్సులు రావడంలేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం హౌసింగ్, విద్యాశాఖ, ఉపాధి పనులపై సమీక్ష జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాముడు, బండి శ్రీనివాసులు, కనపర్తి సుబ్బారెడ్డి, ముమ్మడి స్వప్న, చంద్రభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ పాల్గొన్నారు.

ఖాజీపేట వైస్ ఎంపీపీ సస్పెన్షన్

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే చర్య
- ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి

ఖాజీపేట : ఖాజీపేట -3 ఎంపీటీసీ(వైస్ ఎంపీపీ) చంద్రభాస్కర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా వైస్ ఎంపీపీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారన్నారు. పార్టీలోనే ఉంటూ ఇక్కడ జరిగే అన్ని విషయాలను టీడీపీ వారికి చేరవేస్తున్నారన్నారు. అలాగే ఎమ్మెల్యే గురించి అందరితో తప్పుగా మాట్లాడుతున్నారన్నారు. ఇక నుంచి పార్టీకి చంద్రభాస్కర్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, బండి శ్రీనివాసులు, రాముడు, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వనర్, బి కొత్తపల్లె నాయకుడు నాగిరెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పర్సెంటేజీలు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలో కాంట్రాక్టు వర్క్‌లకు పర్సెంటేజీలు తీసుకుంటున్నట్లు నిరూపిస్తే తాను మున్సిపల్ వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని పాతకోట బంగారు మునిరెడ్డి మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి సవాల్ విసిరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ చంద్రబాబు హయాంలో సీఎఫ్‌ఎంఎస్ విధానం అమలు చేసి కాంట్రాక్టు వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. ఈ వ్యవస్థ ద్వారా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ప్రాధేయపడి చేయించుకోవాల్సి వస్తోందన్నారు. గతంలో మైదుకూరు రోడ్డులో చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ పనులకు టెండర్ వేయాలని తాము చెప్పినా మీరు ముందుకు రాలేదన్నారు. ఈనెల 14న మరో మారు రూ.5కోట్ల పనులకు టెండర్లు పిలుస్తున్నామని పోటీలో పాల్గొని టెండర్లు దక్కించుకోవాలని వరదరాజులరెడ్డికి సూచించారు. 84 ఏళ్ల వయసు వచ్చి వరదరాజులరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం తగదన్నారు. తాము భూములు, స్థలాలు ఆక్రమించినట్లు నిరూపించాలని కోరారు. చాపాడు మండలం అయ్యవారుపల్లెకు చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.45 కోట్ల కాంట్రాక్టు పనులు చేస్తున్నాడని, ఆయన తనకు గానీ, ఎమ్మెల్యేకుగానీ, మున్సిపల్ చైర్మన్‌గాని పర్సెంటేజీలు ఇచ్చారని నిరూపిస్తే తాను పదవికి రాజీనామా చేస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ పిట్టా బాలాజీ, టౌన్ బ్యాంకు డైరెక్టర్ గోదెన గంగాధర్, రాగా నరసింహారావు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వంకదార వీరభద్రయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరులో చిన్న వ్యాపారులను ఆదుకోవాలని ప్రొద్దుటూరు వ్యాపార సంస్థల సమాఖ్య అధ్యక్షుడు వంకదార వీరభద్రయ్య తెలిపారు. ప్రొద్దుటూరు ఆల్ మర్చంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల్స్ రావడంతో స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో మరి కొన్ని మాల్స్ పట్టణంలో ప్రారంభించనున్నారన్నారు. అవి వస్తే చిన్న వ్యాపారులు వ్యాపారం లేక జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సీవీ సురేష్, కేఎంఆర్ మునిరెడ్డి, ఆర్యవైశ్య యువజన సమాఖ్య అధ్యక్షుడు అభినయ్, కార్యదర్శి తల్లం సందీప్, పలు వ్యాపార సంస్థల అధ్యక్షులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక 15వ వార్డు పరిధిలోని 17వ సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు ఎం.సుబ్బారెడ్డి, జిలాని బాషా, సత్యం, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు : గడప గడపకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె సచివాలయం-2 వద్ద మంగళవారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామాలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, ఎంపీటీసీ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దువ్వూరు : అహర్నిశలు ప్రజల సంక్షేమం కోరే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దజొన్నవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను నాయకులతో కలసి ఆయన ఎగురవేశారు.